ప్రత్యేక పూజలు.. అన్నదానాలు

- గణనాథుడికి అంగరంగ వైభవంగా పూజలు
- మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు
- సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తుల సందడి
- పటిష్ట బందోబస్తు నడుమ మండపాలు
- కొనసాగుతున్న గణేష్ విగ్రహాల నిమజ్జనాలు

మేడ్చల్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మేడ్చల్ మున్సిపాలిటీలో, మండలంలోని వివిధ గ్రామాలలో వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ కాలనీలలో ప్రత్యేక పూజలు, వివిధ రకాల ప్రత్యేక కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారులకు పోటీలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తూ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని పాత గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో లక్ష పూల అర్చన నిర్వహించారు. రాఘవేంద్రనగర్‌లో కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అన్ని పార్టీల నాయకులు గణేష్ మండపాల వద్దకు వెళ్లి పూజలు చేస్తూ అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అలాగే పలు ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన గణనాథుల విగ్రహాలను ఆయా ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, కాలువల్లో నిమజ్జనం చేస్తున్నారు.


మేడ్చల్ పాత గ్రామ పంచాయతీ వినాయక మండపం వద్ద లక్ష పూజ అర్చన చేస్తున్న భక్తులు


దమ్మాయిగూడ 13వ వార్డులో...

కీసర, నాగారం, దమ్మాయిగూడలో...

కీసర: గణేష్ నవరాత్రి సంబురాలు కీసర మండలంతోపాటు, నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం దమ్మాయిగూడ మున్సిపాలిటీలో నెలకొల్పిన గణనాథులను చైర్ పర్సన్ ప్రణీతాగౌడ్ దర్శించుకున్నారు. నాగారం మున్సిపల్ పరిధిలోని 6, 7వ వార్డులలో నిర్వహించిన గణేష్ పూజల్లో వార్డు కౌన్సిలర్లు, కౌకుట్ల అనంతరెడ్డి, గూడూరు సబిత ఆంజనేయులుగౌడ్, బీజేపీ నేతలు కౌకుట్ల రాహుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాంపల్లి పాత చెరువు వద్ద గణనాథుల నిమజ్జనోత్సం సందడిగా సాగుతోంది. మున్సిపల్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రైన్ ద్వారా రాంపల్లి చెరువులో వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న గణనాథులను చెరువుల్లో నిమజ్జనం చేస్తున్నారు. చెరువు వద్ద కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య ఆధ్వర్యంలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘట్‌కేసర్‌లో...

ఘట్‌కేసర్: పట్టణంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు భక్తులు శనివారం ఘనంగా నిర్వహించారు. దత్తాత్రేయనగర్ బ్యూటీనెస్ట్ కాలనీలో మణికంఠ రియల్ ఎస్టేట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ సైదులు, స్థానిక కౌన్సిలర్ సంగీత హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కాచవాని సింగారం ముత్వెల్లిగూడ డ్రీమ్ హోమ్స్ కాలనీ వినయక మండపం ఆవరణలో గణపతి హోమం నిర్వహించారు. మండపం ఇన్‌చార్జ్ వేణునేత, ప్రభాకర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, జంగారెడ్డి, మహేశ్, సాయికుమార్, డ్రీమ్ హోమ్స్ కాలనీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ముత్యంరెడ్డి, నరేందర్, శివకోటి పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో...

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో వినాయక నవరాత్రి ఉత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.


నాగారం 7వ వార్డులో...


ఘట్‌కేసర్ దత్తాత్రేయనగర్ బ్యూటీనెస్ట్‌లో అన్నదానం


ముత్వెల్లిగూడ డ్రీమ్ హోమ్స్ కాలనీలో...


జవహర్‌నగర్ శ్రీకృష్ణపురి కాలనీలో...

17 నుంచి 'స్వచ్ఛత హీ సేవా'


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఘట్‌కేసర్: మున్సిపల్ పరిధిలో పక్షం రోజుల పాటు నిర్వహింపతలపెట్టిన 'స్వచ్ఛత హీ సేవా–2024' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కమిషనర్ సాబేర్‌అలీ ఆదేశానుసారం మున్సిపల్ సిబ్బంది శనివారం ఘట్‌కేసర్‌లో ఆవిష్కరించారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు జరుగనున్నాయి. కార్యక్రమంలో శ్రీను, మధు, సందీప్, యదేశ్, రాజేశ్, మహేందర్, కృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ


శేఖర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ ఈటల

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం, నారాయణపూర్ గ్రామానికి చెందిన మల్లెపల్లి శేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ శనివారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటానని ఈ సందర్భంగా ఈటల రాజేందర్ భరోసా ఇచ్చారు.

పంచాయతీ కార్యాలయాల్లో ఓటర్ల ముసాయిదా జాబితా


ఓటర్ల జాబితాను విడుదల చేస్తున్న దృశ్యం

శామీర్‌పేట్: శామీర్‌పేట మండలంలోని 7 గ్రామాల పంచాయతీ కార్యాలయాల వద్ద శనివారం ఓటర్ల ముసాయిదా జాబితాను అధికారులు అందుబాటులో ఉంచారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా గ్రామపంచాయతీ లేదా మండల పరిషత్ కార్యాలయంలో తెలపాలని వారు పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీ లోపు అభ్యంతారాలను స్వీకరిస్తామని, తుది జాబితాను విడుదల చేస్తామని శామీర్‌పేట ఎంపీడీఓ మమతాబాయి వెల్లడించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

శామీర్‌పేట్: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) కింద మెరుగైన వైద్యం కోసం పేదలకు మంజూరైన నిధులకు సంబంధించిన చెక్కులను మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. శామీర్‌పేట మండలం మజీద్‌పూర్ గ్రామానికి చెందిన నాగార్జునకు రూ. 58500, లాల్‌గడి మలక్‌పేట్ గ్రామానికి చెందిన మైసయ్య రూ. 60 వేలు, యాడారం గ్రామానికి చెందిన శంకరయ్య గౌడ్ కు రూ. 33 వేలు మంజూరయ్యాయి. ఆయా చెక్కులను లబ్ధిదారులకు శనివారం ఆయన పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ శామీర్‌పేట మండల యూత్ అధ్యక్షుడు బి.నర్సింహారెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, హనుమాన్‌దాస్, మురళీచారీ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ముఖ్యఅతిథులు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్, మేడిపల్లి జోనల్ స్థాయి ఖోఖో టోర్నీ కొర్రెముల్ జీఆర్‌ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అండర్–17 బాలికల విజేతగా మహాత్మ జ్యోతిరావు పూలే ఘట్‌కేసర్ జట్టు, మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర ఘట్‌కేసర్ జట్టు, అండర్ 14 బాలికల విజేతగా మహాత్మ జ్యోతిరావురావు పూలే జగద్గిరిగుట్ట, బాలుర విజేతగా మహాత్మ జ్యోతిరావు పూలే ఘనాపూర్ జట్టు విజేతగా నిలిచింది. ముఖ్య అతిథిగా పాఠశాల ప్రిన్సిపాల్ సరితకిశోర్, జోన్ సెక్రటరీ శ్రీకాములు హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు తిరుమల్‌రెడ్డి, శివరాములు, మల్లేశ్, మల్లేశ్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

మానవ శ్రేయస్సే ఇంజినీర్ల లక్ష్యం కావాలి

పలు కళాశాలల్లో ఘనంగా ఇంజినీర్స్ డే

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ, కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాలలో శనివారం ఇంజినీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాలలో మోక్షగుండం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మార్‌సీఈలో నిర్వహించన కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీఓ సైంటిస్ట్ ప్రవీణ్‌కుమార్, సీఎంఆర్‌సెట్‌లో పాల్గొన్న రిటైర్డ్ సైంటిస్ట్ శ్రీనివాస్‌శాస్త్రీ, జేఎన్‌టీయూహెచ్ రిటైర్డ్ డైరెక్టర్ రామకృష్ణ ప్రసాద్‌లు మాట్లాడుతూ... భారతరత్న అవార్డు గ్రహీత మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఇంజినీర్ మానవ శ్రేయస్సే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజాన్ని సమర్థవంతంగా నిర్వర్తించేందుకు ఇంజినీర్లు బాధ్యతయుతమైన పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమాల్లో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ అశోక్, నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.


ఎమ్మార్‌సీఈలో నిర్వహించిన ఇంజినీర్స్‌డే వేడుకల్లో పాల్గొన్న సైంటిస్ట్‌లు, అధ్యాపకులు


మోక్షగుండం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు

ఘనంగా హిందీ భాషా దినోత్సవం


సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు

కీసర: రాంపల్లిలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో హిందీ భాషా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజారావు మాట్లాడుతూ... 1949 సెప్టెంబర్ 14న అధికారికంగా గుర్తింపబడిన భాష హిందీ అన్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 14వ తేదిన హిందీ భాష దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకొంటామన్నారు. తమ పాఠశాలల్లో విద్యార్థులకు చదువుతోపాటు, సంస్కృతి, సంప్రాదాయాలు వివిధ భాషలు, విశిష్టతలను విద్యార్థులకు వివరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు, పాటలు, నాటికాలు ఎంతగానో అలరించాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో సత్తాచాటిన విద్యార్థులను నిర్వాహకులు అభినందించారు.


పూడూర్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు...

పూడూర్ పరిధిలో...

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి పూడూర్ గ్రామ వార్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకరయ్య బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జాతీయోద్యమంలో భారతదేశాన్ని జాగృతం చేసి, ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాష ఎంతగానో దోహదపడిందన్నారు. గాంధీజీ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ అధికార భాషగా గుర్తించారని తెలిపారు. అనంతరం హిందీ ఉపాధ్యాయురాలు రమాదేవిని ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి, విజయలక్ష్మి, బద్రీనారాయణ, సాయి వరప్రసాద్, శేఖర్, సాయప్ప, రమాకుమారి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్ కళాశాలలో 'మాక్ ఇంటర్వ్యూ'

మేడ్చల్‌రూరల్: మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం అల్యూమిని క్లబ్ స్పెక్సెషయన్స్ ఆధ్వర్యంలో చివరి సంవత్సరం విద్యార్థులకు మాక్ ఇంటర్వ్యూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ సంస్థల్లో పనిచేస్తున్న పూర్వ విద్యార్థులు పాల్గొని ప్రస్తుత విద్యార్థుల టెక్నికల్, ఇంటర్వ్యూ స్కిల్స్‌ను పరిశీలించారు. అనుచరించాల్సిన పద్ధతులు, మెళకువలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టి.వి.రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, క్లబ్ సెక్రటరీ ఠాకూర్ అక్షయ్ సింగ్, పీఆర్వో రవిసుధాకర్, టీపీఓ శ్రీకాంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలపై విద్యార్థులకు అవగాహన


వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న ప్రతినిధులు

మేడ్చల్‌రూరల్: మైసమ్మగూడలోని ఎమ్మార్ సెట్ కళాశాల ఎంబీఏ విభాగంలో శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. బిల్డింగ్ ఏ గ్లోబల్ కరీర్ అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో వెబ్ టోర టెక్ సీఈఓ షంషుద్దీన్, మహింద్రా లాజిస్టిక్ బిజినెస్ అనాలసిస్ సింధూర, బ్యాంక్ ఆఫ్ బరోడా బిజినెస్ అసోసియేట్ సుబ్రమణ్యం, అగ్రిటెక్ ఫుడ్స్ హెచ్‌ఆర్ రంభదేవి సిమన్‌లు పాల్గొని ఆయా రంగాల్లో ఎంబీఏ విద్యార్థులకు ఉన్న ఉద్యోగ అవకాశాలు, విద్యార్థులు అనుచరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వీఎస్‌కే రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, డీన్ వేణుగోపాల్, ఏఓ రాజేశ్వర్‌రెడ్డి, ఎంబీఏ హెచ్‌ఓడీ నవీన్‌కుమార్, డీన్ సతీష్‌కుమార్, అధ్యాపకులు, పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

కీసర: కీసర బంగారు మైసమ్మ కాలనీలో ఉంటున్న పేద మహిళ మొరుగు యాదమ్మ శనివారం అనారోగ్య కారణంగా మరణించింది. విషయం తెలుసుకుని యాదమ్మ మృతదేహాన్ని కీసర మాజీ ఎంపీటీసీ సభ్యుడు, జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు బెలిదే రమేష్‌గుప్తా సందర్శించి నివాళులర్పించారు. అంతక్రియల నిర్వహణ నిమిత్తం మృతురాలు యాదమ్మ కుటుంబ సభ్యులకు రూ. 5 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

తల్లీకూతురి అదృశ్యం


జానకి,లావణ్య

మల్కాజిగిరి: తల్లీకుమార్తె అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సునీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హిల్‌టాప్ కాలనీకి చెందిన సొమ్యానాయక్, జానకి (24) భార్యాభర్తలు. వీరికి నాలుగేళ్ల పాప లావణ్య సంతానం. కాగా రెండ్రోజుల క్రితం భార్యాభర్తలు గొడవపడ్డారు. ఈ క్రమంలో ఈనెల 12న భర్తకు ఫోన్‌చేసి పనిమీద బయటకు వెళ్తున్నానని, కుమార్తెను ట్యూషన్ వద్ద వదిలిపెట్టానని భర్తకు చెప్పి తిరిగి రాలేదు. ఆమెకీ కోసం వెతికినా ఫలితం లేక పోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లల పెంపకంలో అమ్మమ్మల పాత్ర కీలకం



బోడుప్పల్: పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్రతో పాటు అమ్మమ్మలు, తాతయ్యల పాత్ర కీలకమైందని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన హిందూ భాషా దినోత్సవం, 'గ్రాండ్ పేరెంట్స్ డే' వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లల విషయంలో తల్లిదండ్రులు, అమ్మమ్మలు, తాతయ్యలు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేయాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ అనిల్‌అయ్యంగార్, ప్రిన్సిపాల్ నీలిమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం



అవార్డు అందుకున్న గంగరాజు

బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాల అధినేత జె.గంగరాజుకు డిజిటల్ శాటిలైట్ స్కూల్, ట్రస్మా సంయుక్తంగా బెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డును ప్రదానం చేశాయి. తెలంగాణ రాష్ట్ర ట్రస్మా ముఖ్య సలహాదారులు యాదగిరిశేఖర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి యాదగిరిరావు, ఎబిపీఎస్‌ఏ డైరెక్టర్ సిజా అగస్టస్ చేతుల మీదుగా అందుకున్నారు. పాఠశాలలో సాంప్రదాయ, జాతీయ పండుగల నిర్వహణను దృష్టిలో ఉంచుకుని అవార్డు అందజేశారని గంగరాజు చెప్పారు. తనకు ఈ అవార్డు రావడంతో బాధ్యత మరింత పెరిగిందన్నారు.

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు


సభావేదికపై ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు

కాప్రా: జనవిజ్ఞాన వేదిక రాష్ట్రస్థాయి 5వ మహాసభలు ఏఎస్‌రావునగర్ అణుపురం కమ్యూనిటీహాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. యూనివర్సిటీల స్వేచ్ఛను ప్రభుత్వం హరిస్తుందని, ప్రస్తుతం మనం కౌంటర్ రెవల్యూషన్‌లో ఉన్నామన్నారు. మానవసంబంధాలు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయని, త్యాగాల నుంచే జ్ఞానం వచ్చిందని, పాఠాలు, చరిత్రను మారుస్తున్నారని చెప్పారు. అనంతరం ప్రముఖ పోషకాహార శాస్త్రవేత్త డాక్టర్ మోహబాత్ ఎస్. బాంజి మాట్లాడుతూ.. సమాజాన్ని చెడుదారి నుంచి మంచి మార్గంలో నడిపించేందుకు ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. మహిళలకు కావాల్సిన కనీస పోషకాహారం సరిగ్గా అందడంలేదని, ప్రభుత్వాలు దీనిపై దృష్టిసారించాలన్నారు. వరప్రసాద్ ఆనంద్‌కుమార్, రాజా, రమాదేవి, నాగరాజు, బురాన్, జెన్నీ, మల్లయ్యాచారి, అండాలి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌లో ఓనమ్ వేడుకలు



కాప్రా: ఎల్లారెడ్డిగూడలోని అనురాగ్ మానసిక దివ్యాంగుల స్కూల్‌లో ఓనమ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా హాజరైన పలువురు ప్రముఖులు ఓనమ్ వేడుకల ప్రత్యేకత, విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. అనురాగ్ స్కూల్ ద్వారా సేవలు అందిస్తున్న డైరెక్టర్ డాక్టర్ రామ్‌ను అభినందించారు. అనంతరం విద్యార్థుల వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు అందరినీ ఆకట్టుకున్నాయి. సౌత్ ఇండియా బ్యాంక్ మేనేజర్ సుహాథామస్, ఎన్‌సీటీఈ విశ్రాంత డైరెక్టర్ వాసుదేవన్, తవాడు ప్రెసిడెంట్ రామచంద్రన్ నాయర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో చేతినుంచి జారిపడి..

– బాధితుడికి బ్రాస్లెట్‌ను అందజేసిన పోలీసులు

కుషాయిగూడ: 20 రోజుల క్రితం సూర్య ఆసుపత్రిలో చేతి నుంచి జారిపడిన 5 తులాల బంగారు బ్రాస్లెట్ శనివారం బాధితుడు వీఎస్ రెడ్డినగర్ శ్రీసాయి వెంకటకృష్ణ ఎంక్లేవ్ నివాసి మోహన్‌రెడ్డికి కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ అంజయ్య అప్పగించారు. పోలీసులు తమ విలువైన బంగారాన్ని తిరిగి అప్పగించడంతో బాధితుడు మోహన్ రెడ్డి కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ అంజయ్య మాట్లాడుతూ.. సీసీకెమెరాలను ప్రతి కాలనీలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎస్సై వెంకన్న, హెడ్ కానిస్టేబుల్ రంగన్నలను ఇన్‌స్పెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు.

పీఎల్ఎన్ఆర్ ఎడ్యుకేషనల్ సర్వసభ్య సమావేశం

కాప్రా: పీఎల్ఎన్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ 7వ వార్షిక సర్వసభ్య సమావేశం సాకేత్ ప్రణమ్ కళావేదికలో శనివారం నిర్వహించారు. ఈ సొసైటీ ద్వారా ఇప్పటి వరకు దాదాపు 64 లక్షల మంది సొసైటీ సభ్యుల దాతల సహకారంతో విద్యార్థులకు వివిధ కోర్సుల్లో విద్యను అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. అడ్వైజరీ బోర్డు సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, కోచర్లకోట నిర్మల్ తదితరులు పాల్గొన్నారు.

కాప్రాలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

కాప్రా: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ కాప్రా డివిజన్‌లో పర్యటించారు. చంద్రపురికాలనీలో నివాసం ఉంటున్న ఏషియన్ గేమ్స్ రజత పతకం గ్రహీత అగసర నందిని ఇంట్లోని గణపతి పూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం శివపురికాలనీలో పలు గణనాథుల మండపాలను సందర్శించి పూజలు నిర్వహించారు. స్థానికనేతలు సునీల్ తదితరులు పాల్గొన్నారు.